నేడు వనభోజన మహోత్సవం

అల్లాపూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్ పరిధిలోని కాపు, తెలగ, ఒంటరి, తూర్పు, బలిజ, మున్నూరు కాపు, సామాజిక వర్గాల వారు కార్తీక వనభోజన మహోత్సవాలు నిర్వహించనున్నట్టు 'శ్రీ కృష్ణ దేవరాయ కాపు సంక్షేమ సంఘం' అధ్యక్షుడు మేడిచర్ల రుద్రయ్య ఓ ప్రకటనలో తెలిపారు. బ్యాంక్ కాలనీలోని వాటర్ ట్యాంక్ పక్కన ఆదివారం ఉదయం 10గంటల నుంచి మధ్యా హ్నాం 3వరకు తలపెట్టనున్న వనభోజన కార్యక్రమానికి కాపు బంధుమిత్రులంతా కుటుంబ సమేతంగా రావాలని రుద్రయ్య కోరారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ.. సంఘ జీవుడు అయిన మానవుడు తమ వృత్తికి తగ్గ కట్టుబాట్లు ఉండి కుల వ్యవస్థకు రూపకల్పన చేశాడని, ఆ వ్యవస్థ పటిష్ఠంగా ఉన్నప్పుడు నవ సమాజానికి మరింత మేలు జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రావూరి శ్రీనివాసరావు, మండెల శ్రీనివాస రావు, కరిశెట్టి రామాంజనేయులు పాల్గొన్నారు.

'ఎల్‌ఆర్‌ఎస్'ను రద్దు చేయండి



అసోసియేషన్ గ్రేటర్ హైదరాబాద్ నూతన కార్యవర్గం

పంజాగుట్ట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ రంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బంగారు తెలంగాణ రియల్ ఎస్టేట్ మార్కెటింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. 'ఎల్‌ఆర్‌ఎస్ (లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్)రద్దు.. కాంగ్రెస్ ముద్దు' అంటూ గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని నెరవేర్చాలని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వర్ హుస్సేన్ డిమాండ్ చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అసోసియేషన్ గ్రేటర్ హైదరాబాద్ నూతన కమిటీని ప్రకటించారు. ఈసందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎ.ప్రభాకర్ రెడ్డితో కలిసి ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ అనుమతితో వేసిన లే అవుట్లలో మిగిలిన ఖాళీ ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేయాలని, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. పేద, మధ్య తరగతి ప్రజలు పైసా పైసా కూడబెట్టి ప్లాట్లు, ఇళ్లు కొనుగోలు చేస్తే వివిధ కారణాలతో వారిని వేధిస్తున్నారని.. హైడ్రా గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ప్లాట్లు, ఇళ్ల కొనుగోలు సమయంలో వినియోగదారులకు అన్ని విషయాలపై అవగాహన కల్పించాలని, సంబంధిత పత్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని రియల్ ఎస్టేట్ వ్యాపారులకు సూచించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.యాదమ్మ, గ్రేటర్ ప్రధాన కార్యదర్శి ఎం.మోహన్, కోశాధికారి కె.లక్ష్మి గోపాల్, కోర్ కమిటీ సభ్యులు సరళాదేవి, ఎండీ సర్వర్ పాషా, శివప్రసాద్, లీగల్ అడ్వైజర్ గౌరీ శంకర్, అసోసియేట్ ప్రెసిడెంట్ పద్మశ్రీ, ఎ.నాగరాజు, శిరీషారెడ్డి, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

ఔషధాల ఉ'సిరి'

• ఆయుర్వేద వైద్యంలో అధికంగా వినియోగం

ఉసిరి అనగానే ఆయుర్వేద వైద్యం గుర్తుకొస్తుంది. ఆరోగ్యానికి ఔషధంగా వాడుతారు. వంటకాలు, పూజల్లో కూడా దీని స్థానం ఎక్కువే. ఉసిరి పచ్చడి, ఉసిరి కాయ పులిహోర, ఉసిరికాయ పప్పు లాంటి వంటకాలు చేస్తారు. ఆహార పదార్థంగానే కాకుండా కార్తీక మాసంలో మహిళలు ఉసిరికాయలతో దీపారాధన చేస్తారు. శీతాకాలంలో విరివిగా కాసే ఉసిరికాయలు ప్రస్తుతం మార్కెట్లో కాయ సైజును బట్టి కిలో రూ. 150 నుంచి రూ. 200 వరకు విక్రయిస్తున్నారు.

-ఓల్డుబోయినపల్లి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి)

ఉసిరి చరిత్ర..



జలంధరుడు అనే రాక్షసుడు ఒకానొక సమయంలో పార్వతీ దేవిని మోసం చేయగా ఆమె విష్ణుమూర్తికి ఫిర్యాదు చేస్తుంది. దీంతో విష్ణుమూర్తి సైతం జలంధరుడిని అదే రీతిలో మోసం చేయాలని చూస్తాడు. జలంధరుడి భార్య బృందను మోసగించేందుకు విష్ణుమూర్తి జలందరుడి రూపంలో ఆమె ఇంటికి వెళ్తాడు. పతివ్రత అయిన బృంద ముగ్ద రూపాన్ని చూసిన విష్ణుమూర్తి ఆమెపై మోహం పెంచుకుంటాడు. ఒక రోజు జలంధరుడి రూపంలో ఆమెను తన వశం చేసుకునేందుకు ఆమె ఇంటికి వెళ్ళగా విష్ణుమూర్తి తలపెట్టిన మోసాన్ని గ్రహించిన బృంద ఆత్మార్పణ చేసుకుంటుంది. దీంతో విష్ణుమూర్తి మనస్థాపానికి గురవుతాడు. విషయం గ్రహించిన లక్ష్మీదేవి, పార్వతీ దేవి, సరస్వతీ దేవీ బృంద చితా బస్మంపై మూడు విత్తులు నాటుతారు. దీంతో పార్వతీ దేవి నాటిన విత్తు తులసి మొక్కగా, లక్ష్మీదేవి నాటిన విత్తు ఉసిరిగా, సరస్వతీ దేవి నాటిన విత్తు మాలతిగా మొలకెత్తుతాయి. ఇది చూసిన విష్ణుమూర్తి తన బాధనంతా మరిచిపోయి సాధారణ స్థితికి చేరుకుంటాడు. అందుకే ఈ చరిత్రను ఆధారంగా చేసుకుని కార్తిక పౌర్ణమి రోజున మహిళలు తమ ఐదవ తనం పది కాలాల పాటు చల్లగా ఉండాలని ఉసిరికాయలతో పూజలు చేస్తారు.

భూమిపై మొలిచిన మొదటి చెట్టు ఉసిరి

భూమిపై మొలిచిన మొట్ట మొదటి చెట్టు ఉసిరి అని పెద్దలు చెప్పేవారు. బ్రహ్మదేవుడు ధ్యానం చేస్తున్నప్పుడు కన్నీళ్లు జారీ భూమిపై పడి ఉసిరి చెట్టుగా మొలిచిందని పురాణాలు చెబుతున్నా యి. ఉసిరితో వైద్యం, వంటకాలతో పాటు సాంస్కృతిక ఆచారాలలో ప్రముఖ స్థానం ఉంది. ఇది శ్రేయస్సు, దీర్ఘాయువును సూచిస్తుంది.

- శ్రీనివాసాచారీ, అర్చకులు, సాయినాగేంద్ర ఆలయం, బాలానగర్

సర్వదోష నివారిణి

ఉసిరి చెట్టు మిలియన్ల మంది ప్రజల జీవితాలను సుసంపన్నం చేస్తోంది.. ఉసిరి అత్యంత ముఖ్యమైన ఔషధ మొక్కగా అధ్యయనాలలో తేలింది. భారతీయ సంప్రదాయ వైద్య విధానంలో అన్ని వ్యాధులను అరికడుతుండడంతో దీనిని సర్వదోష నివారిణిగా పిలుస్తారు. ఉసిరితో మూలిక సప్లిమెంట్లు, సౌందర్య సాధనాలు, ఫార్మ స్యూటికల్స్ వంటి ఆమ్లా ఆధారిత ఉత్పత్తులు తయారవుతున్నాయి. ఈ ఉత్పత్తులకు దేశీయ, అంతర్జాతీయ మార్కెట్‌లలో మంచి డిమాండ్ ఉంది.


- డి. వేదశ్రీ, గవర్నమెంట్ టీచర్, ఫతేనగర్

ఉసిరి చెట్టును పూజచేస్తే పుణ్యం

- ఉసిరి చెట్టును విష్ణుమూర్తి స్వరూపంగా భావిస్తారు. కార్తీక మాసంలో ఉసిరి చెట్టుకు పూజలు చేస్తే విష్ణుమూరి ఆశీస్సులు పొందవచ్చని భక్తుల నమ్మకం. కార్తీక మాసంలో ఉసిరి చెట్టుకు పూజలు చేసి ఉసిరి దీపాలు వెలిగించి వన భోజనాలు చేస్తారు.

ఔషధ గుణాలెన్నో

- ఉసిరి జామ్, టానిక్, పొడిలేదా ముక్కలుగా ఏదో ఒక రూపేనా రోజూ కొద్ది మోతాదులో తీసుకుంటే జ్ఞాపక శక్తిని పెరుగుతుంది.
- ఉసిరితో తయారు చేసిన టానిక్ వాడితే ఊపిరి తిత్తుల పని తీరు మెరుగు పడుతుంది.



- శరీర నిరోదక శక్తిని పెంచే చ్యవన్ ప్రెష్ ఔషధ తయారీలో ఉసిరిని వినియోగిస్తారు.
- ఉసిరిలో కాల్షియం, ఐరన్, ప్రొటీన్లు, పాస్పరస్ కార్బోహైడ్రేడ్లు పుష్కలంగా ఉంటాయి. ఆరెంజ్ పండు కంటే అధికంగా సి విటమిన్ ఉంటుంది. ఉసిరిలో కాల్షియం అధికంగా ఉన్నందున ఎముకలు దంతాలు ఆరోగ్యంగా ఉంటాయి. కంటి చూపును మెరుగు పరుస్తుంది.
- ఉసిరిని తింటే వేడి జలుబు, కోరిత దగ్గులను తగ్గిస్తుంది. వ్యాధి నిరోదక శక్తిని బలపరుస్తుంది.
- భోజనం చేశాక ఉసిరిని తీసుకుంటే జీర్ణక్రియను పెంచుతుంది. కడుపు, పేగుల్లో మంటను అరికడుతుంది. శరీరంలోని కొలస్ట్రాల్‌ను తగ్గించి బరువును నియంత్రిస్తుంది.
- ఉసిరి కలిపిన నూనె వాడితే జుట్టు రాలదు, నిగనిగ లాడుతుంది.
- ఇందులో యాంటిమైక్రోబియల్, యాంటి వైరల్ ఔషధ గుణాలు అధికంగా ఉన్నందున రక్త ప్రసరణను మెరుగు పరచి గాస్ట్రిక్ సమస్యలను, రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించి మధుమోహ నియంత్రణకు తోడ్పడుతుంది.



భరత్‌నగర్ మార్కెట్ రోడ్డు పక్కన ఉసిరి కాయలు విక్రయిస్తున్న మహిళలు

జేఎన్‌టీయూలో యూజీసీ, ఎంఎంటీటీసీ డైరెక్టర్‌గా సుష్మ



హైదరాబాద్ సిటీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూలో యూజీసీ-మాలవీయ మిషన్ టీచర్ ట్రైనింగ్ సెంటర్ (ఎంఎంటీటీసీ) డైరెక్టర్‌గా ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ ఎం.సుష్మ నియమితులయ్యారు. యూనివర్సిటీ ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు శనివారం ఉత్తర్వులు జారీచేశారు. 1996లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉమ్మడి జేఎన్‌టీయూలో చేరిన సుష్మ అనంతపురం, కాకినాడ జేఎన్‌టీయూ కళాశాలల్లోనూ ఎలక్ట్రికల్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. తొలిసారి డైరెక్టర్‌గా నియమితులైన ప్రొఫెసర్ సుష్మకు తోటి డైరెక్టర్లు, ఆచార్యులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

సమగ్ర సర్వేపై సమీక్ష



సమావేశంలో కాంగ్రెస్ నాయకులు

బాలానగర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి నియోజక వర్గంలో కొనసాగుతున్న కుటుంబ సర్వేపై కాంగ్రెస్ నాయకులు శనివారం సర్కిల్ అధికారులు, పార్టీ నాయకులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. ఫతేనగర్ ఏ బ్లాక్ అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి ఆధ్వర్యంలో బాలానగర్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఈ సమావేశంలో కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్ పాల్గొన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా కుటుంబ సర్వే పూర్తి అయ్యేలా చూడాలని బండి రమేష్ అధికారులకు, ఎన్యుములేటర్లకు సూచించారు. సమావేశంలో మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ లక్ష్మయ్య, కాంగ్రెస్ నాయకులు పులి, శివకుమార్‌గౌడ్, యుగంధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం కుటుంబంలో సభ్యులుగా చేరేందుకు ఓటర్లు ఎంతో ఆసక్తి కనబరుస్తున్నారని ఆ పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ అడహక్ కమిటీ సభ్యురాలు ఉప్పల పద్మా చౌదరి అన్నారు. వసంతనగర్‌లో శనివారం ఏర్పాటు చేసిన టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. తొలిరోజు 150 మంది సభ్యత్వం తీసుకోవడం సంతోషంగా ఉందన్నారు. వసంతనగర్‌లో ఆదివారం కూడా ఉదయం 10 నుంచి సాయంత్రం 8 గంటల వరకు సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో షేక్ సత్తార్, నాగుండ్ల రామకృష్ణ, చిరుమామిళ్ల ఉమా, సుబ్బారావు, కేతినేని కిషోర్, తెలుగు యువత నాయకులు కాకర్ల గోపీకృష్ణ, కంఠమనేని అశోక్, మణికంఠ వర్మ, మదన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ పరామర్శ

ఓల్డుబోయినపల్లి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): హస్మత్‌పేటలో ఓ ఫాస్ట్‌ఫుడ్ సెం టర్ నిర్వహించే అఫ్సర్ మీద ప్రమాదవశాత్తు శుక్రవారం వేడివేడి నూనె పడి గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అతడిని 108లో గాంధీ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ శనివారం గాంధీ ఆస్పత్రికి వెళ్లి అఫ్సర్‌ను, అతడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అతడి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బీఆర్‌ఎస్ నాయకులు కర్రె జంగయ్య, సయ్యద్‌ఎజాజ్ ఉన్నారు.

అతిథి అధ్యాపకులకు అందని వేతనాలు

హైదరాబాద్ సిటీ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ కాలేజీల్లో అతిథి అధ్యాపకులుగా పనిచేస్తున్న వారికి రెండు నెలలుగా జీతాలు చేతికి రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. యూనివర్సిటీ క్యాంపస్ కళాశాలతో పాటు అనుబంధంగా ఉన్న మరో ఏడు కళాశాలల్లో మొత్తం 150మంది అతిథి అధ్యాపకులుగా పనిచేస్తున్నారు. ఆయా కళాశాలల్లో రెగ్యులర్ అధ్యాపకుల కొరత ఉండడం, కాంట్రాక్టు అచార్యుల నియామకంపై నిషేధం ఉండడంతో వర్సిటీ ఉన్నతాధికారులు గెస్ట్ ఫ్యాకల్టీని నియమించుకున్నారు. వీరికి నెలకు 30తరగతుల బోధన, ల్యాబొరేటరీల్లో విద్యార్థులకు సహకరించినందుకు గాను (సెలవు రోజులను మినహాయిస్తే) సుమారు రూ. 30 వేల నుంచి 45 వేల వరకు ఇవ్వాల్సి ఉంటుంది. గత సెప్టెంబరు, అక్టోబరు నెలలకు సంబంధించి ఒక్కొక్కరికి రూ. 60వేల నుంచి 90వేల వరకు అందాల్సిన వేతనం వారి చేతికి రాలేదు. నెలరోజులుగా క్యాంపస్ కళాశాలలతో పాటు అనుబంధ కళాశాలల ప్రిన్సిపాల్స్, ఇతర ఉన్నతాధికారులు పబ్లిక్ సర్వీస్ కమిషన్ పనుల్లో బిజీగా ఉండడంతో గెస్ట్ ఫ్యాకల్టీ వేతనాల గురించి పట్టించుకోవడం లేదని బాధిత అధ్యాపకులు వాపోతున్నారు. గెస్ట్ ఫ్యాకల్టీ పనిచేసిన రోజులకు సంబంధించిన హాజరును విభాగాధిపతుల నుంచి ప్రిన్సిపాల్ ద్వారా ప్రి-ఆడిట్ సెల్‌కు పంపాల్సి ఉండగా, రెండు నెలలుగా ఆ ప్రక్రియ ఎక్కడికక్కడే నిలిచిపోయినట్టు సమాచారం. దీంతో రెగ్యులర్ ఫ్యాకల్టీ, కాంట్రాక్ట్ ఫ్యాకల్టీతో పాటు సమానంగా తాము కూడా పనిచేస్తున్నామని, అయినప్పటికీ వేతనాలివ్వడంలో వర్సిటీ యాజమాన్యం వివక్ష కనబరుస్తోందని ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉంటే తమకు పాఠాలు చెబుతున్న రెగ్యులర్ ఫ్యాకల్టీకి మాదిరిగానే గెస్ట్ ఫ్యాకల్టీకి వేతనాలను సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

చెక్కు పంపిణీ



లబ్దిదారుడికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

హైదర్‌నగర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్‌కు చెందిన టి.సుదర్శన్‌బాబు అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొంది ఆస్పత్రి బిల్లుల కోసం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నాడు. అతడికి మంజూరైన రూ. 3.50 లక్షల చెక్కును ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శనివారం తన కార్యాలయంలో టి.సుదర్శన్‌బాబు కుటుంబ సభ్యులకు అందజేశారు.

సూరిని పరామర్శించిన ఎమ్మెల్యే

బాలానగర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కొద్ది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు మహం సూరిని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శనివారం పరామర్శించారు. కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డితో కలిసి సూరి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు వెంకటేశ్‌గౌడ్, దేవులపల్లి కృష్ణమూర్తి, ధారం సతీష్‌గుప్తా, ఎలిజాల యాదగిరి, నర్రాదేవేందర్‌రెడ్డి, రంగంపేట శ్రీనివాస్ ముదిరాజ్, ప్రేమ్‌కుమార్, ముత్తా మురళీధర్ తదితరులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

అయ్యప్ప స్వాములకు అన్నప్రసాదం

హైదర్‌నగర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లిలోని శివాలయంలో అయ్యప్ప మాలాధారణ భక్తుల కోసం అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అయ్యప్ప మాలాధరణ భక్తుల కోసం అన్నప్రాద కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని ఆయన అన్నారు.

- కూకట్‌పల్లి అయ్యప్పస్వామి ఆలయంలో మండల దీక్ష పూజలు అరుణ్‌గురుస్వామి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా ప్రారంభించారు. ఆలయ కమిటీ ఛైర్మన్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డెపల్లి రాజేశ్వరరావు, అరుణ్ గురుస్వామి అయ్యప్ప మాలాదరణ చేసుకుని భక్తిశ్రద్ధలతో నియమాల తోరణాన్ని స్వీకరించారు.

ఘనంగా అయ్యప్ప మండల పూజ



అయ్యప్ప మాలధారులకు భిక్ష వడ్డిస్తున్న మాజీ కార్పొరేటర్ శ్రావణ్‌కుమార్

ఫతేనగర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): భరత్‌నగర్ కాలనీ సాయి అయ్యప్ప సాయి ఆలయంలో శనివారం అయ్యప్ప మండల పూజ ఘనంగా నిర్వహించారు. ఈ పూజల్లో మూసాపేట్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ పాల్గొని మధ్యాహ్నం అయ్యప్ప సాముల భిక్షలో పాల్గొని వారికి తన సేవలు అందజేశారు. డిసెంబర్ 29 వరకు రోజూ ఉదయం గణపతి హోమం, అభిషేకం, మధ్యాహ్నం, భిక్ష, సాయంత్రం పడిపూజ, భజన, అల్పాహారం పూజలు ఉంటాయని ఈ పూజల్లో అయ్యప్పలు పాల్గొనాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. కార్యక్రమంలో అయ్యప్ప సాములు నరేందర్, సత్తయ్య, రామకృష్ణ, రాధాకృష్ణ, సప్పిడి వెంకటేశ్, బాలు, సప్పిడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

'డయల్ యువర్ డీఆర్‌ఎం'కు స్పందన

• కూకట్‌పల్లి ఆర్టీసీ డిపో డీఆర్‌ఎం కవిత రూపాల



ఫతేనగర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి ఆర్టీసీ డిపో డిప్యూటీ ఆర్‌ఎం కవిత రూపాల చేపట్టిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి శనివారం ప్రయాణికుల నుంచి స్పందన లభించింది. కూకట్‌పల్లి, మియాపూర్-2, హెచ్‌సీయూ, మేడ్చల్, జీడిమెట్ల డిపోల పరిధిలో రాక పోకలు సాగించే 12మంది ప్రయాణికులు డీఆర్‌ఎం నెంబరుకు నేరుగా ఫోన్ చేసి సమస్యలను వివరించారు. సుమిత్రానగర్, వివేకానందానగర్ బస్టాపుల్లో బస్సులు ఆపడం లేదని ఆపే లా చూడాలని ఓ ప్రయాణికుడు డీఆర్‌ఎంకు ఫిర్యాదు చేశాడు. మేడ్చల్ నుంచి ఘర్ వరకు ఉదయం 9 గంటలకు అదనంగా మరో బస్సును నడపాలని, మేడ్చల్ నుంచి కోఠికి, దుండిగల్ డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయం నుంచి సికింద్రాబాద్ స్టేషన్‌కు నేరుగా బస్సులు నడపాలని ప్రయాణికులు కోరినట్టు డీఆర్‌ఎస్ వివరించా రు. రూట్-45కు బస్సు సౌకర్యం కల్పించాలని కేపీహెచ్‌బీ కాలనీ నుంచి దుండిగల్‌కు నేరుగా బస్సు వేయాలని విద్యార్థుల తల్లి తండ్రులు కోరినట్టు డీఆర్‌ఎం తెలిపారు. ఈఎస్‌ఐ నుంచి కోఠికి గతంలో డైరెక్టుగా బస్సులు ఉండేవని వాటిని తిరిగి పునరుద్ధరించాలని మరో ప్రయాణికుడు డీఆర్‌ఎం దృష్టికి తీసుకొచ్చాడు. ఏపీ ఆర్టీసీ బస్సుల్లో సీనియర్ సిటిజన్‌లకు 25 శాతం రాయితీ ఇస్తున్నారని దానిని తెలంగాణలో అమలయ్యేలా చూడాలని సీనియర్ సిటిజన్లు విన్నవించినట్టు ఆమె స్పష్టం చేశారు. మహిళల కోసం కేటాయించిన సీట్లలో పురుషులు కూర్చుంటున్నారని, మహిళలకు కేటాయించిన సీట్లు కదా.. లేవండి.. చెప్పినా కూడా లేవడంలేదని కొందరు మహిళలు డీఆర్‌ఎంకు ఫిర్యాదు చేశారు. రద్దీగా ఉన్న రూట్లలో కాలేజీలకు, ఉద్యోగాలకు వెళ్లే సమయంలో మహిళల కోసం ప్రత్యేక బస్సులు వేస్తే ఇబ్బంది లేకుండా ఉంటుందని ఆ విషయంపై అధికారులు ఆలోచించాలని మరికొందరు మహిళలు తమ అభిప్రాయాన్ని వెల్లడించారని, ప్రయాణికుల స్పందనపై ఆమె తన సంతృప్తిని వ్యక్తం చేశారు.

కార్పొరేటర్ పర్యటన



స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ సతీష్‌గౌడ్

ఫతేనగర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఫతేనగర్ డివిజన్ హెచ్‌పీ రోడ్డు ప్రాంతాన్ని కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ అధికారులతో కలిసి పరిశీలించారు. దశాబ్దాల కాలం నుంచి గాయత్రి మందిర్ పరిధిలో ఉన్న డ్రైనేజీ సమస్య పరిష్కారానికి పనులు చేపట్టినప్పటికీ కొంత పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పూర్తి చేయాలని మూసాపేట్ సర్కిల్ డీఈ శంకర్‌నాయక్‌కు సూచించారు. కార్యక్రమంలో డివిజన్ ఏఈ రాధాకృష్ణ, నాయకులు జగదీష్, శ్రీనుపటేల్, మల్లికార్జున్, బాబురావు, శ్రీనివాస్ ఎలిజబెత్ పాల్గొన్నారు.

నేడు అష్టలక్ష్మి ఆలయంలో.. రంగాచార్య 20వ స్మారక పురస్కారాల ప్రదానం

హైదరాబాద్‌సిటీ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మరింగంటి శ్రీరంగాచార్య 20వ స్మారక పురస్కారాల ప్రదాన కార్యక్రమం ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు కొత్తపేట్‌లోని అష్టలక్ష్మి ఆలయంలో నిర్వహించనున్నట్టు నిర్వాహకులు విజయసారథి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా త్రిదండి దేవనాథ రామానుజ జీయరు స్వామి, డాక్టర్ ఎన్‌వీ.రంగరామానుజాచార్యులు హాజరవుతారని, ఉత్తమ సంస్కృత పండిత పురస్కారాన్ని సముద్రాల శఠగోపాచార్యులు అందుకుంటారని పేర్కొన్నారు. పురస్కార ప్రదానంతో పాటు గ్రంథాలు, ఆడియోల ఆవిష్కరణ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి రైతుబజార్‌లో కిలో కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి. టమోట రూ. 23, వంకాయ రూ. 55, బెండకాయ రూ. 45, పచ్చి మిర్చి రూ. 35, బజ్జి మిర్చి రూ. 60, కాకరకాయ రూ. 23, బీరకాయ రూ. 35, క్యాబేజీ రూ. 26, బీన్స్ రూ. 53, క్యారెట్ రూ. 65, గోబి పువ్వు రూ. 23, దొండకాయ రూ. 25, చిక్కుడు కాయ రూ. 60, గోరు చిక్కుడు రూ. 28, బీట్‌రూట్ రూ. 50, క్యాప్సికం రూ. 65, ఆలుగడ్డ రూ. 38, కీర రూ. 17, దోసకాయ రూ. 37, సొరకాయ రూ. 25, పొట్లకాయ రూ. 18, కంద రూ. 65, ఉల్లిపొరక రూ. 55, ఉల్లిగడ్డ రూ. 45, మామిడి కాయ రూ. 15-20, అరటి కాయ రూ. 8-9, చామగడ్డ రూ.37, ముల్లంగి రూ.4-5, చిలగడ దుంప రూ.40, గుమ్మడికాయ రూ.40, నిమ్మకాయలు రూ.50-60, మునగ కాయలు రూ.8-10, బొప్పాయి రూ.40, పుట్టగొడుగులు రూ.40, ఎండు మిర్చి రూ.220, అల్లం రూ.160, వెల్లుల్లి రూ.380, చింతపండు రూ.140, పండు మిర్చి రూ.80, ఉసిరి రూ.80, కరివేపాకు రూ.70, పర్వల్ రూ.45, పల్లికాయ రూ.70, లోబా రూ.45, ఆకాకరకాయ రూ.100. పైన పేర్కొన్న ధరలు ఆదివారం ఉదయం 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఓల్డుబోయినపల్లి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): బోయినపల్లి సబ్‌స్టేషన్ పరిధి పలు ఫీడర్లలో మెయింటెనెన్స్, మరమ్మతు పనుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని బోయినపల్లి డీఈ గోపాల్‌రావు ఒక ప్రకటనలో తెలియజేశారు. అరుణాచలం ఫీడర్ పరిధిలో అరుణాచలం, ఎస్‌ఆర్ ఎంటర్‌ప్రైసెస్, జీహెచ్ సిస్టమ్స్‌లలో, ప్రగతి పాక్ ఫీడర్ పరిధిలో ప్రగతి పాక్ కంపెనీలో, గిరినగర్ ఫీడర్ పరిధి గిరినగర్, టీడీపీ ఆఫీసు, ఏపీహెచ్‌బీ కాలనీ, గురుమూర్తినగర్, సౌజన్యనగర్, ఆర్‌ఆర్‌నగర్ ఫీడర్ పరిధి రంగారెడ్డినగర్, పంచశీల కాలనీ, రెయిన్‌బో స్కూలు సాయిలక్ష్మి ఇండస్ట్రీస్, ఏబీ కాలనీ ఫీడర్ పరిధిలోని ఏబీ కాలనీ, జీహెచ్‌ఎంసీ పార్కు, కమ్యూనిటీ హాల్, చివరి బస్టాపు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని డీఈ వివరించారు.

సర్వైకల్ కేన్సర్‌పై అవగాహన



మాట్లాడుతున్న డా.ఛాయాదేవి, చిత్రంలో సీఈవో డా.యోబు

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సర్వైకల్ కేన్సర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని డా.ఛాయాదేవి అన్నారు. రామ్‌దేవ్‌రావు హాస్పిటల్‌లో శనివారం సర్వైకల్ కేన్సర్ ఎలిమినేషన్ డేను పురస్కరించుకొని అడ్మినిస్ట్రేషన్, పారా మెడికల్, నర్సులు, ఫార్మాసిస్టులు, ఆయమ్మలకు సర్వైకల్ కేన్సర్‌పై అవగాహన కల్పించారు. దేశంలో ప్రతి ఎనిమిది నిమిషాలకు ఓ స్త్రీ సర్వైకల్ బారిన పడి చనిపోతున్నారన్నారు. 9 నుంచి 14 సంవత్సరాల బాలికలకు ఫ్రీ వ్యాక్సినేషన్ ఇస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 1500 మందికి వ్యాక్సిన్ ఇవ్వగా, డిసెంబర్ 10వ తేదీన 250 మందికి వ్యాక్సిన్ ఇచ్చే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రివెన్షన్, ఎర్లీ డిటెక్షన్ ఎర్లీ ట్రీట్‌మెంట్ ద్వారా సర్వైకల్ కేన్సర్‌ను నిర్మూలించొచ్చని రామ్‌దేవ్‌రావు హాస్పిటల్ సీఈవో డా.యోబు తెలిపారు. కార్యక్రమంలో డా.భవాని దివ్య, డా.మంజుల, డా.అర్చన తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మించండి



జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

హైదర్‌నగర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): వివేకానందనగర్ డివిజన్ రామారావునగర్ కాలనీలో రోడ్డు నెంబర్-1 నాలా పక్కన ప్రహరీ కూలిపోయి సంవత్సరం కావస్తున్నా ఇప్పటివరకు నిర్మించక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని బీజేపీ నాయకులు కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రహరీ నిర్మించక పోవడంతో పాములు, విషపురుగులు, రోడ్డుపైకి వస్తుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. దీనికి తోడు రాత్రి సమయంలో వీధి దీపాలు లేకపోవడంతో రాకపోకలకు కూడా ఇబ్బందిగా ఉందని వెంటనే పనులు చేపట్టాలని వారు కోరారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు గోపాలరావు, నాయకులు నర్సింగరావు, వెంకట్‌రాములు, విజయరెడ్డి, ఎల్లయ్య, సీహెచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం

• 220కేవీ లైన్‌కు చెట్ల కొమ్మలు తగలడంతో మంటలు



ప్రమాదం జరిగింది ఇక్కడే



ఓ ఇంట్లో కాలిపోయిన స్విచ్‌బోర్డులు, హోల్డర్



కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్‌కు చెట్టు కొమ్మలు తగలడంతో ఎస్‌ఆర్‌ఎస్‌పీ కాలనీలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అదే సమయంలో వసంతనగర్ సెక్షన్ 11కేవీ కోసం ఎల్‌సీ (లైన్ క్లియరెన్స్) తీసుకొని చెట్టు కొమ్మలు కొడుతున్న నేపథ్యంలోనే 220కేవీ లైన్ నుంచి మంటలు రావడంతో అందరూ భయభ్రాంతులకు గురయ్యారు. శనివారం ఉదయం 11.40 గంటల సమయంలో కార్మికులు ఎస్‌ఆర్‌ఎస్‌పీ కాలనీ పార్కు వద్ద చెట్ల కొమ్మలు కొడుతుండగా పెద్ద శబ్దం రావడంతో పాటు మంటలు, పొగలు వచ్చినట్టు గుర్తించిన లైన్ ఇన్‌స్పెక్టర్ జీవీ రామ్మోహన్ కార్మికులను వెంటనే కిందకు దిగాలని ఆదేశించారు. 220కేవీ లైన్‌కు చెట్టు కొమ్మలు తగలడంతో ప్రమాదం జరిగిందని గుర్తించి వెంటనే సంబంధిత విభాగానికి సమాచారం ఇవ్వడంతో ఆ చెట్టును నిమిషాల వ్యవధిలోనే తొలగించారు. ఈ సమయంలో 11కేవీకి కరెంట్ వచ్చి సుమారు నాలుగు ఇళ్లలో స్విచ్ బోర్డులు, ఏసీలు, హోల్డర్లు కాలిపోయాయి. ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఏఈ వాణి సంఘటనా స్థలానికి చేరుకొని వెంటనే సిబ్బందిని అప్రమత్తం చేసిన రామ్మోహన్‌ను ఆమె అభినందించారు. ఆ చెట్టు కొమ్మ గాలికి తగిలిందా? తీగలను తగిలేలా ఉన్న చెట్ల కొమ్మలను ఎందుకు తొలగించలేదు అన్నది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారిందని చెప్పొచ్చు. వెంటనే సిబ్బంది కిందకు దిగకపోతే పరిస్థితి ఏంటి? ఇప్పటికైనా లైన్ అధికారులు అప్రమత్తంగా పనిచేయాల్సి ఉంది.



కొండాపూర్ జిల్లా ఆస్పత్రికి వెళ్లే రహదారిలో పారుతున్న మురుగు

శ్రీరాంనగర్‌లో మురుగు పరుగు

గచ్చిబౌలి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కొండాపూర్ డివిజన్ పరిధిలోని శ్రీరాంనగర్ ఏ-బ్లాక్‌లోని కొండాపూర్ జిల్లా ఆస్పత్రికి వెళ్లే రహదారిలో డ్రైనేజీ పొంగిపొర్లుతోంది. ఆస్పత్రికి వచ్చే రోగులు, బస్తీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీటి నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా వారు స్పందించడం లేదని స్థానికులు వాపోతున్నారు. ప్రజాప్రతినిధులు కాలనీ, అధికారులు స్పందించి డ్రైనేజీ లీకేజీలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు. లేనిపక్షంలో వాటర్ వర్క్స్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.



కార్నివాల్‌లో పాల్గొన్న చిన్నారులు

సందడిగా కిడ్స్ హెల్త్ కార్నివాల్

రాయదుర్గం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పిల్లలను మనం ఎంత ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దితే దేశ భవిష్యత్ అంత ఆరోగ్యవంతంగా ఉంటుందని కాంటినెంటల్ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ గురు ఎన్ రెడ్డి అన్నారు. నానక్‌రామ్‌గూడ ఐటీ జోన్‌లోని కాంటినెంటల్ హాస్పిటల్‌లో శనివారం కిడ్స్ కార్నివాల్ నిర్వహించారు. కార్యక్రమంలో సుమారు 2 వందలకు పైగా చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వారికి డ్రాయింగ్, డ్యాన్స్, మ్యూజిక్‌తో పాటు పలు రకాల ఆటల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఉచిత వైద్య శిబిరం నిర్వహించి పరీక్షలు చేసి సీజనల్ వ్యాధులతో బాధపడుతున్న పిల్లలకు ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ రఘు ఎన్ రెడ్డి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



పార్కు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

అభివృద్ధి పనులను పరిశీలించిన కార్పొరేటర్

హైదర్‌నగర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని వీజేఆర్‌నగర్‌లో రూ.3 కోట్లతో నిర్మిస్తున్న ఫంక్షన్ హాల్, చిల్డ్రన్ పార్కు పనులను శనివారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్కు సుందరీకరణ, ప్రహరీ పనులు శరవేగంగా జరుగుతున్నాయని త్వరలోనే ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులు చేపడతామని తెలిపారు. వీజేఆర్‌నగర్ కాలనీవాసుల చిరకాల కోరిక త్వరలోనే నెరవేరుతుందని అన్నారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణగౌడ్, భాస్కర్, మల్లేశ్, యాదగిరి, అగ్రవాసు, ఫారూఖ్, ఖలీమ్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సాంస్కృతిక కార్యక్రమంలో బాలవికాస్ విద్యార్థులు

ఘనంగా సత్యసాయి బాబా జయంతి

భెల్‌కాలనీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లోని శ్రీ సత్యసాయి బాబా మందిరంలో బాబా 99వ జయంతి వేడుకలు శనివారం ఘనంగా ప్రారంభమైయ్యాయి. సత్యసాయి సేవా సమితీ ఆధ్వర్యంలో బాబాకి నిర్వహించే నిత్య సేవలతో పాటు విశేష కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం బాలవికాస్ విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. వేడుకల్లో భాగంగా ఆదివారం సాయంత్రం సత్యసాయి తత్వం, సేవా విశిష్టత అంశంపై ప్రముఖ ఆధ్మాత్మిక గురువు బ్రహ్మశ్రీ డాక్టర్ మైలవరపు శ్రీనివాసరావుచే ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహిస్తారు. జయంతి వేడుకలు 23 వరకు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

యూజీసీ-ఎంఎంటీటీసీ డైరెక్టర్‌గా సుష్మ



హైదరాబాద్ సిటీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూలో యూజీసీ-మాలవీయ మిషన్ టీచర్ ట్రైనింగ్ సెంటర్ (ఎంఎంటీటీసీ) డైరెక్టర్‌గా ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ ఎం.సుష్మ నియమితులయ్యారు. యూనివర్సిటీ ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. 1996లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉమ్మడి జేఎన్‌టీయూలో చేరిన సుష్మ అనంతపురం, కాకినాడ జేఎన్‌టీయూ కళాశాలల్లోనూ ఎలక్ట్రికల్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. తొలిసారి డైరెక్టర్‌గా నియమితులైన ప్రొఫెసర్ సుష్మకు తోటి డైరెక్టర్లు, ఆచార్యులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.



సహకార వారోత్సవాల్లో ఈనాడు బ్యాంక్ ఉద్యోగులు, సహకార శాఖ అధికారులు

ఘనంగా ఈనాడు సహకార బ్యాంక్ వారోత్సవాలు

హైదరాబాద్ సిటీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఈనాడు సహకార బ్యాంక్ ఆధ్వర్యంలో సహకార వారోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య కార్యనిర్వహణ అధికారి తులసి ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాలకు అనుగుణంగా సేవలందిస్తూ సహకార సంస్థల అభివృద్ధికి తోడ్పాటును అందించాలన్నారు. సమావేశంలో ఈనాడు బ్యాంకు ఉన్నతాధికారులు, ఉద్యోగులు, జిల్లా సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.





పార్కులో పచ్చిక బయళ్లు, ఆకట్టుకుంటున్న ఆహ్లాదకర వాతావరణం



సందర్శకులను ఆకర్షిస్తున్న

గుల్ మొహర్ కాలనీ పార్కు

కాలనీ సంక్షేమ సంఘం, జీహెచ్ఎంసీ సంయుక్తంగా నిర్వహణ

గచ్చిబౌలి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి డివిజన్‌లోని గుల్ మొహర్ కాలనీ పార్కులో పచ్చదనంతో పాటు పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్నారు. ఎక్కడ చూసినా పచ్చికబయళ్లు సందర్శకులను ఆకర్షిస్తున్నాయి. పార్కు అభివృద్ధిలో తీసుకున్న చర్యలకు కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు షేక్ కాసీంకు బెస్ట్ మేనేజర్ ఆఫ్‌ద పార్కు అవార్డు లభించింది. ఆయన

పార్కును మరింత అభివృద్ధి చేస్తాం



జీహెచ్ఎంసీ అధికారుల సహకారంతో పార్కును భవిష్యత్‌లో పార్కును మరింత అభివృద్ధి చేసేందుకు కాలనీ అసోసియేషన్ సిద్ధంగా ఉంది. కార్మికులు, అధికారుల సహకారంతోనే పార్కుకు బెస్ట్ అవార్డు వచ్చింది. ఇదే ఉత్సాహంతో పార్కును మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తాం

- షేక్ కాసీం, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు

పార్కులో ఎక్కువ సమయం గడుపుతూ కార్మికులతో పనులు చేయిస్తు ప్రత్యేక శద్ధ తీసుకున్నారు. పార్కు నిర్వహణ ఖర్చులో 25 శాతం కాలనీ సంక్షేమ సంఘం భరిస్తుండగా, 75 శాతం జీహెచ్ఎంసీ నిధులను వినియోగిస్తున్నారు. జీహెచ్ఎంసీ కాలనీ సంక్షేమసంఘం సంయుక్తగా పార్కు అభివృద్ధి, నిర్వహణ చేయడంతో పార్కు పచ్చదనంతో ఆహ్లాదం పంచుతోంది. పార్కుకు వచ్చే సందర్శకులను ఆకట్టుకుంది. నిత్యం వందలాది మంది కాలనీ వాసులు, పరిసర ప్రాంత ప్రజలు పార్కును సందర్శించి సేద తీరుతున్నారు.



గుల్ మొహర్ కాలనీ పార్కు

పార్కులో ఓపెన్ జిమ్

జీహెచ్ఎంసీ సహకారంతో పార్కులో ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేశారు. పెద్దలు, యువత, వృద్ధులు జిమ్‌ను ఉపయోగిస్తున్నారు. మహిళలు సైతం ఓపెన్ జిమ్‌లో వ్యాయామం చేస్తున్నారు.

పార్కులో బాతులు, కోళ్లు, కుందేలు, సీమ కోళ్లతో పార్కు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. నీటి కొలనులో బాతుల విన్యాసాలు, రంగురంగుల రామచిలుకలు, పావురాలు, చిన్నాలతో పాటు పెద్దలను కూడా ఆకర్షిస్తున్నాయి.

యోగా తరగతులు

యోగా గురువు సురేందర్ ప్రతి రోజు ఉదయం ఉచితంగా యోగా తరగతులు నిర్వహిస్తున్నారు. ఇక్కడకు వచ్చే మహిళలు కొంత సమయం పార్కులో గడిపి తర్వాత యోగా తరగతులకు వెళ్తున్నారు.

అనేక రకాలుగా ఈ పార్కును కాలనీ వాసులతో పాటు పరిసర కాలనీ వాసులు ఉపయోగించుకుంటున్నారు.

సుందరీకరణతో చెరువులకు మహర్దశ

- ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

మియాపూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సామాజిక బాధ్యతలో భాగంగా మల్లిగవాడ్ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. శనివారం మియాపూర్ గుర్నాథం చెరువు, హఫీపేటలోని కైదమ్మ కుంట చెరువుల సుందరీకరణ పనులను మల్లిగవాడ్ ఫౌండేషన్, నెక్సస్ సెలెక్ట్‌మాల్స్ సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా చేపట్టనున్న పనులకు ఆయన కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, కంపెనీ ప్రతినిధులు, ఇరిగేషన్ అధికారులతో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు.



చెరువు సుందరీకరణ పనులకు శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, అధికారులు, సంస్థల ప్రతినిధులు

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాజెక్ట్‌తో కీలకమైన సహజ వనరులను పునరుజ్జీవింపచేయడమే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా భవిష్యత్‌లో సుస్థిరమైన అభివృద్ధి కోసం ఒక నమూనాను ఏర్పాటు చేస్తుందన్నారు. చెరువుకట్ట చుట్టూ చెట్లు పెంచి చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కలిపిస్తామని తెలిపారు. చెరువుల సుందరీకరణ చేపట్టేందుకు సంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు.

చెరువు సుందరీకరణ పనుల్లో భాగంగా చెరువు కట్ట, మురుగునీటి కాల్వ నిర్మాణం, అలుగు మరమ్మతులు, వాకింగ్ ట్రాక్ వంటి పనులు చేయడం జరుగుతుందన్నారు. పనుల నాణ్యత విషయంలో రాజీపడకుండా త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఈ నళిని, జీహెచ్ఎంసీ ఏఈ సంతోష్, ఐటీ సంస్థ ప్రతినిధులు రామ్‌బొట్ల, చైతన్య, నెక్సస్ సెలెక్ట్ మాల్స్ ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

మెడికవర్ ఆస్పత్రిలో ప్రీ మెచ్యూరిటీ డే-2024

హైదరాబాద్ సిటీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నెలలు నిండకుండానే పుట్టిన పిల్లలని ఎదిగే క్రమంలో కంటికి రెప్పలాగా కాపాడుకోవాలని మెడికవర్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హరికృష్ణ అన్నారు. హైటెక్‌సిటీ మెడికవర్ ఉమెన్ అండ్ చైల్డ్ ఆస్పత్రిలో శనివారం సెలబ్రేటింగ్ టైనీ మిరాకల్స్, ప్రీ మెచ్యూరిటీ డే-2024 ఉత్సవాన్ని నిర్వహించారు. మెడికవర్ సీనియర్ నియోనాటాలజిస్టు డాక్టర్ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ నెలలు నిండకుండా 23 నుంచి 37 వారాల లోపే పుట్టే పిల్లలందరినీ ప్రీ మెచ్యూర్ అని, 28 వారాల లోపే పుట్టే పిల్లలు "ఎక్స్‌ట్రీమ్ ప్రీ మెచ్యూర్" బేబీస్ అంటారన్నారు. వీళ్ల పుడుతూనే అనారోగ్య సమస్యలు వెంట తెచ్చుకోవడంతో పాటు, ఎదిగే క్రమంలో కూడా ఎన్నో రకాల సమస్యలకు లోనవుతారన్నారు. తల్లి నుంచి పొందే సమృద్ధి పోషణను కోల్పోతారని, 34 వారాల కంటే ముందుగా పుట్టిన పిల్లలు నేరుగా తల్లి పాలు తీసుకోలేరన్నారు. శ్వాసకోశ, హీమోడైనమిక్ అస్థిరత, అసిడోసిస్, సెప్సిస్ మొదలైన అవలక్షణాలు కలిగి ఉంటాని, షుగర్ లెవెల్స్, శరీర ఉష్ణోత్రలు క్రమంలో పెట్టాలన్నారు. లేదంటే నెలలు నిండకుండా పుట్టిన పిల్లలు ప్రాణాలు కోల్పోయే ప్రమాదముంటుందన్నారు. కార్యక్రమంలో ప్రీటర్మ్ బేబీల తల్లిదండ్రులు వారి అనుభవాలు తెలియచేశారు. కుటుంబాల చిరునవ్వులు



మెడికవర్ ప్రీ మెచ్యూరిటీ డే-2024లో పాల్గొన్న ఆస్పత్రి డాక్టర్లు, చిన్నారులు, వారి తల్లిదండ్రులు

చిందించే ఇన్‌స్టంట్ ఫోటో ఫ్రేమ్‌కార్నర్ ఏర్పాటు చేసి కుటుంబాలు తమ బిడ్డలు, వైద్య బృందంతో ఉన్న జ్ఞాపకాలు ముద్రించుకొని సోషల్ మీడియాలో పంచుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్లు నవిత, వంశీ, రాధిక, ఎస్‌వీ. లక్ష్మి, మధుమోహన్‌రెడ్డి, జనార్దన్ రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వేతనాలు అందక జేఎన్‌టీయూలో గెస్ట్ ఫ్యాకల్టీ గగ్గోలు

హైదరాబాద్ సిటీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ కాలేజీల్లో అతిథి అధ్యాపకులుగా పనిచేస్తున్న వారికి రెండు నెలలుగా జీతాలు రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. యూనివర్సిటీ క్యాంపస్ కళాశాలతో పాటు అనుబంధంగా ఉన్న మరో ఏడు కళాశాలల్లో మొత్తం 150 మంది అతిథి అధ్యాపకులుగా పనిచేస్తున్నారు. ఆయా కళాశాలల్లో రెగ్యులర్ అధ్యాపకుల కొరత ఉండడం, కాంట్రాక్టు ఆచార్యుల నియామకంపై నిషేధం ఉండడంతో వర్సిటీ ఉన్నతాధికారులు గెస్ట్ ఫ్యాకల్టీని నియమించుకున్నారు. వీరికి నెలకు 30 తరగతుల బోధన, ల్యాబొరేటరీల్లో విద్యార్థులకు సహకరించినందుకు గాను (సెలవు రోజులను మినహాయిస్తే) సుమారు రూ.30 వేల నుంచి 45 వేల వరకు ఇవ్వాల్సి ఉంటుంది. గత సెప్టెంబరు, అక్టోబరు నెలలకు సంబంధించి ఒక్కొక్కరికి రూ. 60 వేల నుంచి 90 వేల వరకు అందాల్సిన వేతనం వారి ఇంకా చేతికి రాలేదు. నెలరోజులుగా క్యాంపస్ కళాశాలలతో పాటు అనుబంధ కళాశాలల ప్రిన్సిపాల్స్, ఇతర ఉన్నతాధికారులు పబ్లిక్ సర్వీస్ కమిషన్ పనుల్లో బిజీగా ఉండడంతో గెస్ట్ ఫ్యాకల్టీ వేతనాల గురించి పట్టించుకోవడం లేదని బాధిత అధ్యాపకులు వాపోతున్నారు. గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేసిన రోజులకు సంబంధించిన హాజరును విభాగాధిపతుల నుంచి ప్రిన్సిపాల్ ద్వారా ప్రి-ఆడిట్ సెల్‌కు పంపాల్సి ఉండగా, రెండు నెలలుగా ఆ ప్రక్రియ ఎక్కడికక్కడే నిలిచిపోయినట్టు సమాచారం. దీంతో రెగ్యులర్ ఫ్యాకల్టీ, కాంట్రాక్ట్ ఫ్యాకల్టీతో పాటు సమానంగా తాము కూడా పనిచేస్తున్నామని, అయినప్పటికీ వేతనాలివ్వడంలో వర్సిటీ యాజమాన్యం వివక్ష కనబరుస్తోందని ఆరోపిస్తున్నారు.

ఇదిలా ఉంటే తమకు పాఠాలు చెబుతున్న రెగ్యులర్ ఫ్యాకల్టీకి మాదిరిగానే గెస్ట్ ఫ్యాకల్టీకి వేతనాలను సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

'ఎల్‌ఆర్‌ఎస్'ను రద్దు చేయండి

- బంగారు తెలంగాణ రియల్ ఎస్టేట్ మార్కెటింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్

పంజాగుట్ట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ రంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బంగారు తెలంగాణ రియల్ ఎస్టేట్ మార్కెటింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. 'ఎల్‌ఆర్‌ఎస్ (లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్) రద్దు.. కాంగ్రెస్ ముద్దు' అంటూ గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని నెరవేర్చాలని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వర్ హుస్సేన్ డిమాండ్ చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అసోసియేషన్ గ్రేటర్ హైదరాబాద్ నూతన కమిటీని ప్రకటించారు. ఈ సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎ.ప్రభాకర్ రెడ్డితో కలిసి ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అనుమతితో వేసిన లే అవుట్లలో మిగిలిన ఖాళీ ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేయాలని, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. పేద, మధ్య తరగతి ప్రజలు పైసా పైసా కూడబెట్టి ప్లాట్లు, ఇళ్లు కొనుగోలు చేస్తే



అసోసియేషన్ గ్రేటర్ హైదరాబాద్ నూతన కార్యవర్గం

వివిధ కారణాలతో వారిని వేధిస్తున్నారని.. హైడ్రా గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ప్లాట్లు, ఇళ్ల కొనుగోలు సమయంలో వినియోగదారులకు అన్ని విషయాలపై అవగాహన కల్పించాలని, సంబంధిత పత్రాలను తనిఖీ చేయాలని రియల్ ఎస్టేట్ వ్యాపారులకు సూచించారు. సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదమ్మ, గ్రేటర్ ప్రధాన కార్యదర్శి ఎం.మోహన్, కోశాధికారి కె.లక్ష్మి గోపాల్, కోర్ కమిటీ సభ్యులు సరళాదేవి, ఎండీ సర్వర్ పాషా, శివప్రసాద్, లీగల్ అడ్వైజర్ గౌరీ శంకర్, అసోసియేట్ ప్రెసిడెంట్ పద్మశ్రీ, ఎ.నాగరాజు, శిరీషారెడ్డి, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

గ్రూపు-3 పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- 115 పరీక్షా కేంద్రాలు.. 65,361 మంది అభ్యర్థులు
- కేంద్రాల వద్ద 144 సెక్షన్ : మేడ్చల్ కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ ప్రతినిధి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): టీజీపీఎస్సీ గ్రూప్-3 పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా జరిగేలా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు. నేడు, రేపు రెండు రోజుల పాటు జరుగనున్న గ్రూప్-3 పరీక్షలకు జిల్లాలో 115 కేంద్రాలు ఏర్పాటు చేశామని 65,361 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారన్నారు. రెండు సెషన్‌లలో పరీక్షలు ఉంటాయని ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఒక సెషన్, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5 గంటల వరకు రెండో సెషన్ ఉంటుందన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఉదయం సెషన్‌కు 8.30 గంటల నుంచి మధ్యాహ్నం సెషన్‌కు 1.30 గంటల నుంచి అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారన్నారు. పరీక్షలకు మొదటి సెషన్‌కు ఉపయోగించిన హాల్ టికెట్ కాపీని మిగిలిన సెషన్‌లకు ఉపయోగించాలని కలెక్టర్ సూచించారు. తుది ఎంపిక ప్రక్రియ పూర్తయ్యే వరకు అభ్యర్థులు తప్పనిసరిగా హాల్ టికెట్, అన్ని సెషన్‌ల ప్రశ్నాపత్రాలను భద్రపరుచుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, అదనపు బస్సులు, నిరంతరం విద్యుత్ సరఫరా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ స్పష్టం చేశారు.

శారీరక శ్రమ ఎంతో అవసరం

- 5కే, 2కే రన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గచ్చిబౌలిలోని స్టేడియం వద్ద ప్రణవ్ తేజ్, అక్రాంత్ దేవరకొండ ఆధ్వర్యంలో 5కే, 2కే రన్‌ను శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా హాజరై జెండాఊపి రన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి ఉరుకుల పరుగుల జీవితంలో శారీరక శ్రమ ఎంతో అవసరమని గుర్తు చేయడానికి ఈరన్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వృద్ధులు, యువత, చిన్న పిల్లలు పాల్గొనడం అభినందనీయమన్నారు. మారిన జీవన శైలిలో ప్రతి ఒక్కరు తప్పని సరిగా వ్యాయామం చేయాలని, ఈ రన్ ఎంతోమందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అశోక్‌గౌడ్, మాజీ కౌన్సిలర్ లక్ష్మీనారాయణగౌడ్, జనార్దన్‌రెడ్డి, కరుణాకర్‌గౌడ్, రాంచంద్రం తదితరులు పాల్గొన్నారు.



శిల్పారామంలో కళాకారుల నృత్య ప్రదర్శన

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

మాదాపూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్‌లోని శిల్పారామంలో శనివారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కథక్ నాట్య గురువు సంజుక్త ఘోష్ శిష్యబృందం మొదటగా బెంగాలీ సంస్కృతి సంప్రదాయ రవీంద్రనాథ్ ఠాగూర్ పాటలకు కథక్ నృత్యంలో శివస్త్రోం, శివ తాండవం, జయంతి దేవి చాముండే అంశాలపై చక్కటి ప్రదర్శనలో అలరించారు. అనంతరం ప్రవీణ్ శిష్య బృందం నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలో భాగంగా జతిస్వరం, రామాయణ శబ్దం, మరకత, మండూక శబ్దం, దశావతార శబ్దం తదితర అంశాలపై చక్కటి అభినయంతో సందర్శకులను అలరించారు.

విద్యార్థులు లక్ష్యసాధనకు కృషి చేయాలి

భెల్‌కాలనీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్య సాధన కోసం నిరంతరం కృషి చేయాలని రాష్ట్ర విద్యాశాఖ సంయుక్త డైరెక్టర్ రాజేందర్ సింగ్ అన్నారు. బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లోని శేరిలింగంపల్లి ప్రభుత్వ డిగ్రీ కాలేజీని శనివారం ఆయన సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. కృషి పట్టుదలతో ఉత్తమ ఫలితాలను సాధించాలన్నారు. కాలేజీలో విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. కవిత సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

భెల్‌కాలనీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో వస్తున్న మార్పులు, కాలుష్యం, కలుషిత ఆహారం వల్ల వచ్చే రోగాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ శ్రేష్ఠ ఆస్పత్రి, అరుణ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి ఉచిత వైద్య శిబిరాన్ని రామచంద్రాపురం ఐదు గుళ్ల ప్రాంగణంలో నిర్వహిస్తున్నామని ఆస్పత్రి చైర్మన్ వీరభద్రయ్య గౌడ్ తెలిపారు. గైనకాలజీ, ప్రసూతి సేవలు, సంతానలేమి సమస్యలు, ఆర్థోపెడిక్ సమస్యలపై శిబిరంలో సలహాలు ఇవ్వడం జరుగుతుందని, ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గుట్ట రాజీవ్‌గృహకల్పలో రౌడీల రాజ్యం!

- వెల్ఫేర్ అసోసియేషన్ ముసుగులో అరాచకాలు
- ఎక్స్‌టెన్షన్ పేరిట ప్రభుత్వ స్థలాల కబ్జా
- పోలీసులు, రాజకీయ నాయకుల అండదండలు
- గంజాయి విక్రయాలు-మహిళలకు రక్షణ కరువు

జీడిమెట్ల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): జగద్గిరిగుట్ట రాజీవ్‌గృహకల్పలో రౌడీ మూకలు రాజ్యమేలుతున్నాయి. వెల్ఫేర్ అసోసియేషన్ ముసుగులో వీరు సాగిస్తున్న గూండాయిజంతో సామాన్యులు బెంబేలెత్తిపోతున్నారు. స్థానిక రాజకీయ నాయకులు, పోలీసుల అండదండలతో వీరి అరాచకాలు, భూకబ్జాలు మితిమీరిపోతున్నాయి. రాజీవ్‌గృహకల్ప నివాసాల్లో ఎక్స్‌టెన్షన్ ముసుగులో ప్రతి ఇంటి నుంచి లక్షల రూపాయలు వసూలు చేసి కోట్ల రూపాయలు కొల్లగొట్టారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రోడ్లను కబ్జాచేసి నిర్మాణాలు,


కబ్జా స్థలంలో నిర్మాణం

కనీసం ప్రమాదాలు చోటుచేసుకుంటే తప్పించుకునే అవకాశం లేకుండా గృహాలను నిర్మించారు. అలాగే పార్కుల కోసం వదిలిన స్థలాలు, మిగిలిన ఖాళీ స్థలాలను ఈ ముఠాలు కబ్జా చేసి దర్జాగా విక్రయిస్తున్నారు. కాలం చెల్లిన వెల్ఫేర్ అసోసియేషన్‌ను అడ్డుపెట్టుకుని వీరు పెత్తనం సాగిస్తున్నారు. కనీసం తిరిగి ఎన్నికలు పెట్టాలన్నా ఆలోచన కూడా ఎవరికి రాకుండా స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. వీరి విషయంలో రెవెన్యూ, హౌజింగ్ బోర్డు, గాజులరామారం టౌన్‌ప్లానింగ్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. దీనికి కారణం స్థానికంగా ఉన్న ఓ ప్రజాప్రతినిధి, ఆయన అనుచరులే అని తెలుస్తుంది. కోట్ల రూపాయాల ప్రభుత్వ భూములను కబ్జాచేసి, అమ్ముకోవడం వీరికి పరిపాటిగా మారింది. అదేవిధంగా పోలీస్‌స్టేషన్‌కు పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలంలో డబ్బాల ముసుగులో కబ్జాలకు పాల్పడుతున్న ఈ ముఠా ఆగడాలను ఇటీవల కొందరు వెలుగులోకి తీసుకురావడంతో వారిపై దౌర్జన్యానికి యత్నించినట్టు తెలుస్తుంది. ఈ విషయమై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినా, ఇప్పటి వరకు వారిపై ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు కన్పించడం లేదు. ఇదేతంతు కొనసాగితే ఇక్కడ సామాన్య ప్రజలు జీవించడం కష్టమని కొందరు స్థానికులు పేర్కొంటున్నారు.

ఖాళీ ప్లాట్లను విక్రయిస్తున్న ముఠా

అధికారులు కేటాయించగా మిగిలి ఉన్న



రౌడీ మూకల నుంచి రక్షణ కల్పించాలని జగద్గిరిగుట్ట సీఐకి ఫిర్యాదు చేస్తున్న బాధితుడు

ప్లాట్లను వెల్ఫేర్ అసోసియేషన్ ముసుగులో దర్జాగా విక్రయిస్తున్నారు. ఇటీవలె రెండు ప్లాట్లను వీరు లక్షల రూపాయాలకు విక్రయించినట్టు తెలుస్తుంది. నోటరీ పైనే విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. సంబంధిత అధికారులకు ఈ విషయం తెలిసినా పట్టించుకోవడం లేదు. అధికారులకు ముట్టచెప్పాల్సినవి ముట్టచెప్పి, వాళ్ల లక్షల సంపాదిస్తున్నారు.

అరాచకాలను అరికట్టాలి

జగద్గిరిగుట్ట రాజీవ్‌గృహకల్పలో కొన్ని అసాంఘిక శక్తులు రాజ్యమేలుతున్నాయి. ప్రధానంగా ఈ ముఠాలు నడిరోడ్డుపైనే మందు తాగడం, గంజాయి సేవించడం వంటి చేష్టలతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంగా సాగుతున్న ఈ తతంగాన్ని అడ్డుకోవాల్సిన పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్న. అధికారులు ఇక్కడ సాగుతున్న అరాచకాలను అరికట్టి, సామాన్య ప్రజలకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

లింకురోడ్ల నిర్మాణంతో ట్రాఫిక్‌ను నియంత్రించవచ్చు

- ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

దుండిగల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): లింకురోడ్ల నిర్మాణంతో ప్రధాన రహదారులపై ట్రాఫిక్ నియంత్రణ, రద్దీని తగ్గించవచ్చునని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. హైదరాబాద్ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ హెచ్‌ఆర్‌డీసీఎల్ లింకురోడ్ల నిర్మాణంలో భాగంగా రూ. 29 కోట్లతో చేపడుతున్న పాక్ సాగర్, రామ్‌రెడ్డినగర్, ఇండస్ట్రీయల్ ఏరియా లింకురోడ్ల పనులను ఎమ్మెల్యే శనివారం అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లింకురోడ్ల నిర్మాణంతో చుట్టుపక్కల ప్రాంతాలు శరవేగంగా అభివృద్ధి చెందుతాయన్నారు. ఈ లింకురోడ్ల నిర్మాణ పనుల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చూడాలని అధికారులను కోరారు.

ఈ కార్యక్రమంలో హెచ్‌ఆర్‌డీసీఎల్ సీఈ శ్రీనివాస్, ఈఈ విజయ్‌కుమార్, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ సురేందర్‌రెడ్డి, మ్యాప్ ఇంజనీర్ జయశ్రీ, విజయ్‌కుమార్, విట్టలయ్య, హెచ్‌ఆర్‌డీసీఎల్ అధికారులు జలమయ్య, విజయ్‌కుమార్, మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి, పోలె శ్రీకాంత్, ఇస్మాయల్ పాల్గొన్నారు.


అధికారులతో కలిసి మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

బేకరిగడ్డలో చెత్త తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

జీడిమెట్ల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): గాజులరామారం సర్కిల్ పరిధిలో పడకేసిన పారిశుధ్యం కథనానికి అనూహ్య స్పందన లభించింది. సర్కిల్ డీసీ మల్లారెడ్డి పారిశుధ్యం విభాగం అధికారి, అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్, ఇతర సిబ్బందిపై తీవ్రస్థాయిలో ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. అదేవిధంగా ఎంటమాలజీ విభాగం అధికారులు, సిబ్బందిపై కూడా విరుచుకుపడ్డారు. దీంతో శనివారం ఉదయం ఆగమేఘాల మీద పెద్దఎత్తున శానిటేషన్ సిబ్బంది రోడామిస్త్రీనగర్ బేకరిగడ్డ ప్రాంతంలో పేరుకుపోయిన చెత్తా చెదారాలను తొలగించి, బ్లీచింగ్ పౌడర్ చల్లారు.

ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంతో బేకరిగడ్డ ప్రాంతంలో అధికారులు స్పందించి ఎంతో కాలంగా పేరుకు పోయిన చెత్తను తొలగించే విధంగా చర్యలు తీసుకోవడంతో స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.


చెత్తను తొలగిస్తున్న సిబ్బంది

నర్సింహబస్తీలో పర్యటించిన కార్పొరేటర్


జలమండలి అధికారికి సమస్యను వివరిస్తున్న కార్పొరేటర్

గాజులరామారం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): దేవేందర్‌నగర్ నర్సింహబస్తీలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం కార్పొరేటర్ రావుల శేషగిరి జలమండలి అధికారి రోహిణితో కలిసి పర్యటించారు. అనంతరం నర్సింహబస్తీలో తాగునీటి సమస్యను ఆమెకు వివరించి, వెంటనే సిబ్బందితో పైప్‌లైన్లకు మరమ్మతు పనులు చేయించారు. ఈ కార్యక్రమంలో మురళీకృష్ణ, నర్సింహ, రాఘవ, దేవేందర్, మహిళలు పాల్గొన్నారు.

స్వాతంత్ర్యం కోసం ఉరితాడును ముద్దాడిన వీరుడు భగత్‌సింగ్


పోస్టర్‌ను ఆవిష్కరించిన సీపీఐ నాయకులు

గాజులరామారం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని జగద్గిరిగుట్ట, గాజులరామారంలో భగత్‌సింగ్ మేనల్లుడు ప్రొఫెసర్ జగన్మోహన్‌సింగ్ పర్యటనను విజయవంతం చేయాలని సీపీఐ జాతీయసమితి సభ్యులు పిలుపునిచ్చారు. అనంతరం వారు జగద్గిరిగుట్టలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. సీపీఐ జాతీయ సమితి సభ్యుడు యూసూఫ్ మాట్లాడుతూ గతంలో భగత్‌సింగ్ పేరు వింటేనే యువకుల్లో రక్తం ఉరకలు వేసేదన్నారు. భగత్‌సింగ్ బ్రిటీష్ వారిని క్షమాభిక్ష కోరితే ఉరిశిక్షను రద్దు చేసే అవకాశం ఉన్నప్పటికీ భారతదేశ స్వాతంత్ర్యం కోసం ఉరితాడును ముద్దాడిన వీరుడు భగత్‌సింగ్ అన్నారు. కార్యక్రమంలో వెంకటేష్, బాబు, రామిరెడ్డి, ఉమామహేష్, దుర్గయ్య, హరినాథ్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

- కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ

దుండిగల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేట గ్రామంలో ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తనవంతు కృషి చేస్తున్నానని మల్లంపేట కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. మున్సిపాలిటీలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు, ప్రజా ప్రతినిధులు, కాలనీ సంఘాల సభ్యులు తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆయనను కలిసి విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ కాలనీలో ప్రజల సౌకర్యార్థం మౌళిక సదుపాయాలు


కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణను కలిసిన మల్లంపేట వాసులు

కల్పించడమే ధ్యేయంగా ఎప్పటికప్పుడు అధికారులతో మాట్లాడి ముందుకు వెళుతున్నాం అన్నారు. ఏసమస్య ఉన్నా తన దృష్టికి తీసుకు వస్తే అధికారులతో మాట్లాడి, సమస్య పరి ష్కారానికి కృషి చేస్తాం అన్నారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా శ్రీనివాస్‌రెడ్డి

దుండిగల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మేడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లా గ్రంథాలయ సంస్థ నూతన చైర్మన్‌గా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ బి-బ్లాక్ అధ్యక్షులు బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నియమించింది. తన సేవలను గుర్తించిన అధిష్ఠానం తనకు చైర్మన్ పదవి కట్టబెట్టినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రికి, రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.


బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి

యూజీసీ-ఎంఎంటీటీసీ డైరెక్టర్‌గా సుష్మ

హైదరాబాద్ సిటీ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూలో యూజీసీ-మాలవీయ మిషన్ టీచర్ ట్రైనింగ్ సెంటర్ (ఎంఎంటీటీసీ) డైరెక్టర్‌గా ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ ఎం.సుష్మ నియమితులయ్యారు. యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వైస్ చాన్స్‌లర్ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు శనివారం ఉత్తర్వులు జారీచేశారు. 1996లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉమ్మడి జేఎన్‌టీయూలో చేరిన సుష్మ అనంతపురం, కాకినాడ జేఎన్‌టీయూ కళాశాలల్లోనూ ఎలక్ట్రికల్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. తొలిసారి డైరెక్టర్‌గా నియమితులైన ప్రొఫెసర్ సుష్మకు తోటి డైరెక్టర్లు, ఆచార్యులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.


ప్రొఫెసర్ ఎం. సుష్మ

పారా మెడికల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

మేడ్చల్ ప్రతినిధి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి) : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్(ఈసీఐఎల్)లోని ప్రభుత్వ వైద్య కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పారా మెడికల్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా వైద్యాధికారి రఘునాథస్వామి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. డిప్లొమా ఇన్ మెడికల్ స్టెరిలైజేషన్ మేనేజ్‌మెంట్ అండ్ ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్(డీఎంఎస్ఓటీ), డిప్లొమా ఇన్ ఈసీజీ టెక్నీషియన్(డీఈసీజీ) కోర్సులలో ప్రవేశానికి అవకాశం ఉందని, ఈ కోర్సులకు ఇంటర్ లేదా తత్సమాన అర్హత అవసరమన్నారు. కోర్సుల కాలవ్యవధి రెండు సంవత్సరాలు ఉంటుందని, ప్రతి కోర్సులో 30 సీట్లు ఉన్నాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 21 సాయంత్రం 5 లోగా తమ దరఖాస్తులను సమర్పించాలన్నారు. వివరాల కోసం కుత్బుల్లాపూర్(ఈసీఐఎల్) ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్స్‌పాల్‌ను సంప్రదించాలని డీఎంహెచ్ఓ తెలిపారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం లాంటిది : కొలన్


చెక్కులను పంపిణీ చేస్తున్న కొలన్ హన్మంత్‌రెడ్డి

నిజాంపేట్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు వరం లాంటిదని, అర్హులైన పేద ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి తెలిపారు. నియోజకవర్గంలోని 125, 126, 131 డివిజన్లకు చెందిన పలువురు అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా హన్మంత్‌రెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు ద్వారా ఆ ముగ్గురికి రిలీఫ్ ఫండ్‌ను మంజూరు చేయించారు. శనివారం ఆయన లబ్దిదారులకు రూ.60 వేల చెక్కులను పంపిణీ చేశారు. ఈ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాజేందర్ రెడ్డి, వెంకటేష్, గణేష్, జీవన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, వేణుగౌడ్, గఫర్, మధుసూదన్‌రెడ్డి, అజయ్, అరుణ్, ప్రశాంత్‌రెడ్డి, శ్యామల, ఉపేందర్ ఉన్నారు.

కాలనీకి బస్సు సౌకర్యాన్ని కల్పించాలి

నిజాంపేట్ కార్పొరేషన్ రాజీవ్‌గృహకల్ప కాలనీ నుంచి నగరంలోని వివిధ ప్రాంతాలకు సరైన బస్సుసౌకర్యం లేక ఉద్యోగులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డిని రాజీవ్‌గృహకల్ప వాసులు కలిసి పలుమార్లు విన్నవించుకున్నారు. వారి విన్నపాలకు స్పందించిన ఆయన కూకట్‌పల్లి డిపో అధికారులతో పలుమార్లు చర్చలు జరిపారు. ఈ నేపథ్యంలో శనివారం కూకట్‌పల్లి డిపో మేనేజర్, సిబ్బందితో రాజీవ్‌గృహకల్పకు చేరుకున్నారు. హన్మంత్‌రెడ్డి వారితో కలిసి రాజీవ్‌గృహకల్పలో పర్యటించారు. బస్సుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండే అవకాశాలను పరిశీలించారు. దీంతో ఆర్టీసీ అధికారులు రెండురోజుల్లో ఇక్కడ బస్సులను ప్రారంభిస్తామని అందరి ముందు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రామచంద్ర నాయక్, శ్రీనివాస్, లక్ష్మణ్, సరితారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, బాలకృష్ణ, ఉషారాణి, కిరణ్‌గౌడ్ ఉన్నారు.

గణపతి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

నిజాంపేట్ కార్పొరేషన్ బాచుపల్లిలోని దేవి హోమ్స్ అపార్టుమెంట్స్‌లో శనివారం జరిగిన గణపతి దేవాలయ విగ్రహ ప్రతిష్ఠ, చండీహోమంలో కొలన్ హన్మంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పూజల్లో పాల్గొన్నారు. ప్రజలంతా గణపతి దేవుని ఆశీస్సులతో, ఆరోగ్యంగా, సుఖ సంతోషాలతో ఎల్లప్పుడూ ఉండాలని ఆయన కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మురళీ, మధు, రాజ్‌కుమార్, జీవన్‌రెడ్డి, గణేష్, కాంగ్రెస్ నాయకులు వెంకటేష్, రామ్‌పాండు, మధు సూదన్‌రెడ్డి, భక్తులు ఉన్నారు.

మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో 34.15% సమగ్ర కుటుంబ సర్వే పూర్తి

- 1,29,706 గృహాల్లో సర్వే..

మేడ్చల్ ప్రతినిధి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో 34.15 శాతం పూర్తయినట్లు అధికారులు వెల్లడించారు. ఈ నెల 6న ప్రారంభమైన ఇంటింటి సర్వేకు జిల్లాలో 2756 మంది ఎన్యూమరేటర్లను, 274 మంది సూపర్‌వైజర్లను నియమించారు. పది రోజుల్లో జిల్లాలో 34.15 శాతం పూర్తి చేశారు. జిల్లాలో మొత్తం 3,79,766 గృహాలు ఉండగా అందులో 1,29,706 గృహాల్లో సర్వే పూర్తిచేయగా ఇంకా 2,50,060 గృహాల్లో సర్వే చేయాల్సి ఉంది. 15 రోజుల్లో సర్వే పూర్తి చేయాల్సి ఉండగా ఇంకా ఐదు రోజులు మాత్రమే మిగిలి ఉంది.

65.85 శాతం గృహాల సర్వే ఐదు రోజుల్లో పూర్తి కాకపోగా మరో 15 రోజులు అదనంగా సర్వే చేయాల్సి ఉంటుంది. ప్రతి రోజు ఒక్కో ఎన్యూమరేటరు 10 నుంచి 15 గృహాల సర్వే పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ అది సాధ్యం కావడం లేదు. సర్వే పట్టికలో ప్రశ్నలను పూర్తి చేయడానికి దాదాపు 40 నుంచి 55 నిమిషాల సమయం పడుతుందని ఎన్యూమరేటర్లు తెలుపుతున్నారు. దీనికితోడు చాలా గృహాల వద్ద యజమానులు సరైన సమాధానాలు తెలుపకపోవడంతో మరికాస్త ఆలస్యమౌతుందని వారు వాపోతున్నారు. జిల్లాలో సమగ్ర కుటుంబ సర్వే సాఫీగా సాగుతుందని ఉన్నతాధికారులు తెలుపుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం ఎన్యూమరేటర్లు ఇబ్బందులకు గురౌతున్నారు. సమయం ఎక్కువగా లేకపోవడంతో కొన్ని ప్రశ్నలకు ఎన్యూమరేటర్లే సమాధానాలు నింపి వేస్తున్నారు.

కొన్ని ప్రాంతాల్లో సర్వే అధికారులు వస్తున్న విషయం తెలుసుకుని ఇంటి యజమానులు ఇంటికి తాళం వేసి వెళ్లిపోతున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు నిర్వహించిన సర్వేలో 6184 ఇళ్లకు తాళాలు వేసి ఉన్నట్లుగా అధికారులు నమోదు చేశారు. నగరశివారు చుట్టూ విస్తరించి ఉన్న జిల్లాలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వారు నివాసాలు ఉంటున్నారు. సర్వే సమయంలో వారు వారి సొంత ప్రాంతాలకు తరలిపోతుండటం కూడా అధికారులకు తలనొప్పిగా మారింది.

సర్వే వివరాలు ఎక్కడ తెలిపినా ఇబ్బందులు ఉండవని అధికారులు తెలుపుతున్నప్పటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ఇబ్బందులు ఎదురౌతాయనే అనుమానాలతో చాలా మంది వారి వారి గ్రామాల్లోనే వివరాలు తెలిపేందుకు ఆసక్తి చూపుతున్నారు. జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్‌లతో పాటు ఇతర జిల్లా అధికారులు ప్రతి రోజు సర్వే తీరును క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు.


సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలిస్తున్న మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్

నేడు రంగాచార్య స్మారక పురస్కారాల ప్రదానం

హైదరాబాద్‌సిటీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మరింగంటి శ్రీరంగాచార్య 20వ స్మారక పురస్కారాల ప్రదాన కార్యక్రమం ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు కొత్తపేట్‌లోని అష్టలక్ష్మి ఆలయంలో జరగనుందని నిర్వాహకులు విజయసారధి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా త్రిదండి దేవనాథ రామానుజ జీయరు స్వామి, డాక్టర్ ఎన్‌వీ.రంగరామానుజాచార్యులు పాల్గొంటారని, ఉత్తమ సంస్కృత పండిత పురస్కారాన్ని సముద్రాల శఠగోపాచార్యులు అందుకుంటారని పేర్కొన్నారు. పురస్కార ప్రదానంతో పాటు గ్రంథాలు, ఆడియోల ఆవిష్కరణ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

తప్పును సరిదిద్దుకున్న వక్ఫ్‌బోర్డు అధికారులు

దుండిగల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సర్వే నంబరు 58 నుంచి 226 వరకు రిజిస్ట్రేషన్లను నిలిపి వేయడంపై బీజేపీ నాయకులు సెప్టెంబరు 27న కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్, తహశీల్దార్, జిల్లా కలెక్టర్‌కు పూర్తి ఆధారాలను అందజేశారు. ట్విటర్ ద్వారా వక్ఫ్‌బోర్డు తప్పులను ప్రభుత్వానికి ఎత్తిచూపడంతో పాటు, ప్రజల తరపున ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి పాదయాత్రకు కూడా సిద్ధమయ్యారు. పాదయాత్ర కోసం ఇచ్చిన పిలుపును గమనించిన ఉన్నతాధికారులు తమ తప్పును సరిదిద్దుకున్నారు. వారుచేసిన తప్పు ఏమిటంటే 58, 226 సర్వే నంబర్లు అని టైప్ చేయాల్సి ఉండగా, 58 నుంచి 226 వారికి 41 గుంటల భూమి అని రాయడం, ఈ వివాదానికి ప్రధాన కారణమైంది. దీనిని పూర్తిస్థాయిలో పరిశీలించిన అధికారులు 41 గుంటల వక్ఫ్‌భూమి సర్వే నంబరు 58, 226లో మాత్రమే ఉన్నదని వక్ఫ్‌బోర్డు ఐజీ రిజిస్ట్రార్‌కు లేఖ రాశారు. బీజేపీ ప్రజల పక్షాన తీసుకున్న ఈ పోరాటంతో, ఉన్నతాధికారులు సమస్య పరిష్కారానికి సహకరించారు. ఈ ఉద్యమానికి సహకరించిన స్థానిక ప్రజలకు, పార్టీ సభ్యులకు సతీష్ ధన్యవాదాలు తెలిపారు.


బీజేపీ నాయకులు ఆకుల సతీష్

మెడికల్ కాలేజీ నిర్మాణానికి వినతి

కుత్బుల్లాపూర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో మెడికల్ కాలేజీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఆరోగ్యశాఖమంత్రి దామోదర రాజనర్సింహకు దళిత హక్కుల పోరాటసమితి రాష్ట్ర అధ్యక్షుడు కె.ఏసురత్నం, దళిత సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ చైర్మన్ గట్టు అశోక్‌లు వినతిపత్రాన్ని అందచేశారు. నియోజకవర్గంలో ఎక్కువశాతం పేద, మధ్య తరగతి ప్రజలు నివసిస్తున్నారని, ఉన్నత విద్యలు చదివించుకోలేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. మెడికల్ కాలేజీ నిర్మిస్తే వారికి ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. దీనికి స్పందించిన మంత్రి రాజనర్సింహ తప్పకుండా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.


మంత్రి రాజనర్సింహకు వినతిపత్రాన్ని అందజేస్తున్న దళిత సంఘాల నాయకులు

యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

- జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేష్

కుత్బుల్లాపూర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేష్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం చింతల్ హెచ్ఎంటీ గ్రౌండ్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన హెచ్ఎంటీ ప్రీమియర్ లీగ్ సీజన్-2 క్రికెట్ టోర్నమెంట్‌లో ప్రకాశ్ 11 టీం విజేతగా నిలిచింది. ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించిన ఈ పోటీల్లో ప్రకాశ్ 11, క్రేజీఫెండ్స్, సంతు బ్లాస్టర్స్, హెచ్ఎంటీ రైజర్స్, పటేల్ 11, మజిసా క్రికెట్ క్లబ్ జట్లు పాల్గొన్నాయి. మజిసా క్రికెట్ క్లబ్, ప్రకాశ్ 11 జట్లు ఫైనల్‌కు చేరాయి. మొదటి స్థానంలో ప్రకాశ్-11, ద్వితీయ స్థానంలో మజిసా క్రికెట్‌క్లబ్ జట్లు నిలిచాయి. సీఐ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు నాగరాజు, ఫయాజ్, జీడిమెట్ల ఎస్ఐ ప్రేమ్ పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందిస్తున్న సీఐ గడ్డం మల్లేష్

వేతనాలు అందక జేఎన్‌టీయూలో గెస్ట్ ఫ్యాకల్టీ గగ్గోలు

హైదరాబాద్ సిటీ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ కాలేజీల్లో అతిథి అధ్యాపకులుగా పనిచేస్తున్న వారికి రెండు నెలలుగా జీతాలు చేతికి రాకపోవడంతో వారంతా గగ్గోలు పెడుతున్నారు. యూనివర్సిటీ క్యాంపస్ కళాశాలతో పాటు అనుబంధంగా ఉన్న మరో ఏడు కళాశాలల్లో మొత్తం 150మంది అతిథి అధ్యాపకులుగా పనిచేస్తున్నారు. ఆయా కళాశాలల్లో రెగ్యులర్ అధ్యాపకుల కొరత, కాంట్రాక్టు ఆచార్యుల నియామకంపై నిషేధం ఉండటంతో వర్సిటీ ఉన్నతాధికారులు గెస్ట్ ఫ్యాకల్టీని నియమించుకున్నారు. వీరికి నెలకు 30 తరగతుల బోధన, ల్యాబొరేటరీల్లో విద్యార్థులకు సహకరించినందుకుగాను (సెలవు రోజులను మినహాయిస్తే) సుమారు రూ.30వేల నుంచి 45వేల వరకు ఇవ్వాల్సి ఉంటుంది. అయితే గత సెప్టెంబరు, అక్టోబరు నెలలకు సంబంధించి ఒక్కొక్కరికి రూ.60వేల నుంచి 90వేల వరకు అందాల్సిన వేతనం వారి చేతికి రాలేదు. గత నెలరోజులుగా క్యాంపస్ కళాశాలలతో పాటు అనుబంధ కళాశాలల ప్రిన్సిపాల్స్, ఇతర ఉన్నతాధికారులు పబ్లిక్ సర్వీస్ కమిషన్ పనుల్లో బిజీగా ఉండటంతో గెస్ట్‌ఫ్యాకల్టీ వేతనాల గురించి పట్టించుకోవడం లేదని బాధిత అధ్యాపకులు వాపోతున్నారు. గెస్ట్ ఫ్యాకల్టీ పనిచేసిన రోజులకు సంబంధించిన హాజరును విభాగాధిపతుల నుంచి ప్రిన్సిపాల్ ద్వారా ప్రి-ఆడిట్ సెల్‌కు పంపాల్సి ఉండగా, రెండు నెలలుగా ఆ ప్రక్రియ ఎక్కడికక్కడే నిలిచిపోయినట్లు సమాచారం. దీంతో రెగ్యులర్ ఫ్యాకల్టీ, కాంట్రాక్ట్ ఫ్యాకల్టీతో పాటు సమానంగా తాము కూడా పనిచేస్తున్నామని, అయినప్పటికీ వేతనాలివ్వడంలో వర్సిటీ యాజమాన్యం వివక్ష కనబరుస్తోందని ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉంటే తమకు పాఠాలు చెబుతున్న రెగ్యులర్ ఫ్యాకల్టీకి మాదిరిగానే గెస్ట్ ఫ్యాకల్టీకి వేతనాలను సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.